సాక్షి అనంతపురం

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.4°/ 16.6°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. గాలివేగం స్వల్పంగా పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకమైనదని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య 103వ జయంతి నిర్వహించారు. జేసీ ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య చిన్నప్పటి నుంచి కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. 38 ఏళ్ల పిన్నవయసులో ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. ప్రజాహిత పాలన కోసం పలు సంస్కరణలు అమలుచేసి అందరి మన్ననలు పొందారన్నారు. జాతికి ఆయన చేసిన సేవలను గుర్తించి విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ నేషనల్ యూనివర్సిటీకి దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీగా మార్చారన్నారు. సమాజ హితమే లక్ష్యంగా సేవలందించిన సంజీవయ్య బాటలో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి, ఆలిండియా రేడియో ప్రోగ్రాం స్టేషన్ డైరెక్టర్ నాగేశ్వరెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి, మార్కెటింగ్ ఏడీ చౌదరి, క్రిస్టియన్ మైనారిటీ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీలో పలువురికి చోటు

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పలువురిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లా ఉపాధ్యక్షులుగా సీవీ రంగారెడ్డి (గుంతకల్లు), పాసం నాగరంగస్వామి (తాడిపత్రి), ప్రధాన కార్యదర్శిగా భూమిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి (రాప్తాడు) నియమితులయ్యారు.

జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్‌గా వెన్నం

జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ రాగేపరశురాం స్థానంలో శింగనమల నియోజకవర్గానికి చెందిన వెన్నం శివరామిరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

79 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా బుధవారం 79 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 3,829 మందికి గాను 3,750 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రజారోగ్యానికి ప్రాణం

"అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ చాలా బాగుంది. మాతా శిశుమరణాల నియంత్రణలో గణనీయమైన పురోభివృద్ధి కనిపించింది. వ్యాధుల నిర్ధారణ వేగంగా జరుగుతోంది. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా మానవ వనరులు బాగా పెరిగాయి. ప్రజారోగ్య వ్యవస్థలో కొత్త మార్పులు కనిపిస్తున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా వేలాదిమందికి మెరుగైన వైద్యం అందుతోంది."

– రెండు రోజుల క్రితం జిల్లాలో పర్యటించిన కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ ప్రాంతీయ సంచాలకులు ఎం.అనురాధ చేసిన వ్యాఖ్యలివి.

- టీడీపీ హయాంలో శిథిలమైన ఆరోగ్య వ్యవస్థ
- మందులు, వైద్యులు, నర్సుల కొరతతో ప్రజలు విలవిల
- అవుట్‌సోర్సింగ్ వ్యవస్థతో కోట్లాది రూపాయల దుర్వినియోగం
- నేడు ప్రాథమిక ఆరోగ్యానికి బలమైన పునాదులు వేసిన సీఎం జగన్
- పల్లెల ముంగిటకే మెరుగైన వైద్యం తీసుకెళ్లిన సర్కారు





టీడీపీ హయాంలో: కళ్యాణదుర్గంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఇలా.. **వైఎస్సార్‌సీపీ పాలనలో:** ఆధునిక హంగులతో కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజారోగ్య వ్యవస్థ మళ్లీ ప్రాణం పోసుకుంది. రోగులకు మెరుగైన వైద్యమందించడమే ధ్యేయంగా సాగిన జగన్ సర్కారు యజ్ఞంలో ఆరోగ్య ఉపకేంద్రాలు మొదలుకొని, సర్వజనాస్పత్రి వరకు ఊపిరి పోసుకున్నాయి. 2014–19 మధ్య టీడీపీ హయాంలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వాస్పత్రులు.. గడిచిన నాలుగేళ్లలో కొత్త శోభను సంతరించుకున్నాయి. మందులు, వైద్యుల కొరత, పడిపోయే స్థాయికి భవనాలు, పారామెడికల్ సిబ్బంది నియామకాలు లేకపోవడం.. ఇలా ఒకటేమిటి.. ప్రభుత్వ ఆస్పత్రులంటేనే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ పేద రోగులు భయాందోళన చెందేవారు. ఇప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులు మాకెందుకు.. ప్రభుత్వాస్పత్రుల్లోనే అంతకు మించిన మెరుగైన వైద్యం అందుతుండగా అనే ధైర్యంతో ఉన్నారు.

2014–19 మధ్య కాలంలో ఇలా..

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు డాక్టర్లు లేక వెలవెలబోయాయి. ఉన్న ఒక్క డాక్టరు ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి. చివరకు అరకొరగా ఉన్న నర్సులు, పారామెడికల్ సిబ్బందే కట్లు కట్టేవారు.
- సర్వజనాస్పత్రిలో మందులు లేక రోగులు విలవిలలాడేవారు. ఆ ఐదేళ్లలో అనంతపురం వైద్యకళాశాలకు కొత్తగా ఐదుగురు డాక్టర్లే నియామకమయ్యారు.
- రక్తపరీక్షలన్నీ మెడాల్ అనే సంస్థకు అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చారు. దీనివల్ల కోట్ల రూపాయలు ఆ సంస్థకు దోచిపెట్టారు. రక్తపరీక్షలు కాంట్రాక్టు తీసుకున్న సంస్థ వైద్యపరీక్షలు చేయక, రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించేవారు.
- అనంతపురం మెడికల్ కాలేజీకి ఎంబీబీఎస్ సీట్లు, పీజీ సీట్లు పెంచడానికి కనీస ప్రయత్నం చేయలేదు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో పీజీ, యూజీ వైద్యసీట్లు రాలేదు.
- ఆరోగ్య ఉపకేంద్రాల (సబ్ సెంటర్స్)ను పట్టించుకునే దిక్కులేక, సిబ్బంది లేక శిథిలావస్థకు చేరుకున్నాయి.
- 108, 104 వాహనాలకు నిధులు ఇవ్వకపోవడంతో అంబులెన్సు వ్యవస్థ పూర్తిగా అటకెక్కింది.
- ఆస్పత్రుల పునర్నిర్మాణం లేదా కొత్త భవనాల నిర్మాణం జరగకపోవడంతో భవనాలు కూలిపోయే దశకు చేరుకున్నాయి.

2019–24 మధ్య కాలంలో ఇలా..

- ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికీ ఇద్దరు డాక్టర్ల నియామకంతో 24 గంటలూ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.
- సర్వజనాస్పత్రిలో 500 రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. ఐదేళ్లలో అనంతపురం వైద్యకళాశాల–ఆస్పత్రికి 58 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల (డాక్టర్లు) నియామకం జరిగింది
- రక్తపరీక్షల కోసం ప్రతి ఆస్పత్రిలో సొంత ల్యాబొరేటరీ ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ నుంచి సర్వజనాస్పత్రి వరకూ అన్నిరకాల వైద్యపరీక్షలు ఇక్కడే చేసేలా ఏర్పాటు చేశారు. దీనికోసం పారామెడికల్ సిబ్బందిని నియమించారు.
- అనంతపురం మెడికల్ కాలేజీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 50 ఎంబీబీఎస్ సీట్లు, 74 పీజీ సీట్లు వచ్చాయి. ఐదేళ్లలో రూ.300 కోట్లకు పైగా వెచ్చించారు.
- ఆరోగ్య ఉపకేంద్రాల (సబ్ సెంటర్స్)ను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్‌గా మార్చారు. అన్నిటికీ కొత్త భవనాలు నిర్మించారు. ఈ వ్యవస్థ పూర్తిగా మారింది.
- గతంలో 30 కూడా లేని 108 వాహనాలు.. ఇప్పుడు మండలానికి రెండు చొప్పున కేటాయించారు. ఇందులో 70 శాతం కొత్త వాహనాలే. ఘటనాస్థలికి 15 నిమిషాల్లోనే వెళ్లేలా చేశారు. అంబులెన్సు వ్యవస్థ పూర్తిగా మారింది
- ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు అన్నీ 'నాడు–నేడు' కింద కొత్తరూపు సంతరించుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా కొత్త ఆస్పత్రులను కడుతున్నారు. ఎక్కడ చూసినా కొత్త భవనాలతో ఆస్పత్రుల రూపురేఖలే మారిపోయాయి.

జగన్‌తోనే పేదల జీవితాల్లో మార్పు



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: జగన్ సీఎం అయ్యాకే పేదల జీవితాల్లో మార్పు వచ్చిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం 50వ డివిజన్‌లోని 68వ సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాల సమావేశ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు వస్తున్నాయని, మీ క్షేమం కోరే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో రూ.3 లక్షల కోట్లు అప్పు చేశారని, ఆ డబ్బులు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని ప్రశ్నించారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అడిగే దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని చూసి, మరోసారి సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని చేసుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో రూ.1045 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో టీటీడీ కల్యాణమండపం నుంచి తిక్క రంగయ్యస్వామి గుడి వరకు రోడ్డు ఎలా ఉండేది.. ఇప్పుడు ఏవిధంగా దాని రూపురేఖలు మార్చామో ఆలోచించాలన్నారు. ప్రస్తుతం శాంతినగర్ సర్కిల్ నుంచి తపోవనం వరకు జరుగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానికంగా ఉన్న అంధుల ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, నాయకులు బిందుప్రియ, రామచంద్ర, పాల్గొన్నారు.

టికెట్లు.. 'పరిటాల' పాట్లు

- రాజకీయాలను శాసించిన కుటుంబానికి ఇప్పుడు కష్టాలు
- రెండు సీట్ల నుంచి ఒక సీటుకు.. అదీ ఎక్కడో తేల్చుకోలేని దైన్యం
- 2019లో రాప్తాడు నుంచి పోటీచేసి ఓడిపోయిన పరిటాల శ్రీరామ్
- పోటీలో ఎవరు ఉండాలో తేల్చుకోలేకపోతున్న తల్లీతనయులు
- సొంత పార్టీ టీడీపీలోనే సునీతకు పెరిగిన రాజకీయ ప్రత్యర్థులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిటాల కుటుంబం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటోంది. ఫ్యాక్షనిస్టుగా, మాజీ నక్సలైటుగా జిల్లాలో దశాబ్దకాలం పాటు పరిటాల రవి రాజకీయాలను శాసించారు. ఆయన మరణానంతరం టీడీపీ గడ్డు కాలం ఎదుర్కొంటోంది. సొంత పార్టీలోనే గ్రూపులు, అధిష్టానం ఆడుతున్న డ్రామాలు వెరసి పరిటాల సునీత, తనయుడు పరిటాల శ్రీరామ్ రాజకీయ భవిష్యత్‌కు ప్రతిబంధకాలయ్యాయి. మరోవైపు తల్లీ కొడుకుల మధ్యే ఎన్నికల్లో పోటీ ఎవరు చేయాలనే మీమాంస వీరిని ఇరకాటంలో పెడుతోంది.

పరిటాల కుటుంబం ప్రభ తగ్గింది

పరిటాల రవి మరణానంతరం ఆయన భార్య పరిటాల సునీత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యారు. మంత్రిగా ఉండి కూడా ఆమె ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో జిల్లాలో క్రమంగా పరిటాల కుటుంబ పరపతి తగ్గింది. పరిటాల శ్రీరామ్ వ్యవహారశైలి కూడా జనానికి ఆ కుటుంబాన్ని దూరం చేసింది. 2019లో సునీత పోటీ చేయకుండా పరిటాల శ్రీరామ్ రాప్తాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు. దీంతో జిల్లాలో పరిటాల ప్రభ పూర్తిగా మసకబారింది.

ప్రభావం లేదని గుర్తించిన అధిష్టానం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిటాల కుటుంబ ప్రభావం ఏమాత్రమూ లేదనడానికి తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తున్న తీరే కారణం. 'మీ కుటుంబానికి ఒక్కటే సీటు.. ఇష్టమైతే రండి లేదంటే పోండి' అన్నట్టు చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. దీంతో రాప్తాడు, ధర్మవరం రెండు నియోజకవర్గాల్లోనూ పోటీ చేయాలని భావించిన సునీత, శ్రీరామ్‌ల ఆశలు అడియాసలయ్యాయి. మరోవైపు సునీత ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఒక్క టికెట్ అయితే సరిపోతుందని చంద్రబాబు తన అనుకూల మీడియాలో లీకులు ఇప్పించారు. అధిష్టానం దెబ్బతో తల్లీ తనయులు కుదేలయ్యారు.

పోటీలో తల్లా.. కొడుకా?

రానున్న ఎన్నికల్లో ఎవరు పోటీయాలనే దానిపై తల్లీకొడుకు తేల్చుకోలేక పోతున్నారు. 2019లో పోటీచేసి ఓడిపోయిన శ్రీరామ్.. మళ్లీ తనకే టికెట్ కావాలని తల్లిమీద ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. కొడుకైతే ఓడిపోతాడని, తానే పోటీ చేస్తానని సునీత భావిస్తున్నట్టు తెలుస్తోంది. శ్రీరామ్‌కు టికెట్ ఇవ్వకపోతే ఒప్పుకోడు.. ఇస్తే ఓడిపోయే పరిస్థితులున్నాయి. దీంతో సునీత తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, పైగా రాప్తాడులో గతంలోలాగా కేడర్ సహకరించే పరిస్థితి లేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

గ్రూపులు వెంటాడుతున్నాయి

పరిటాల కుటుంబానికి రాజకీయ ప్రత్యర్థులు ఎక్కువయ్యారు. ధర్మవరంలో వరదాపురం సూరికి, పరిటాల కుటుంబానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇక పయ్యావుల కేశవ్‌కు పరిటాల కుటుంబంతో పొసగదు. ప్రభాకర్ చౌదరికి అస్సలే పడదు. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాలో చెప్పుకుంటూ వెళితే ఏ ఒక్క నాయకుడూ పరిటాల కుటుంబంతో అనుకూలంగా లేకపోవడం కూడా వీరికి మైనస్‌గా మారింది. పరిటాల పతనమే తమ లక్ష్యమంటూ ప్రత్యర్థులు పావులు కదుపుతున్నారు.

సేవాలాల్ మహరాజ్ బాటలో పయనిద్దాం

- ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు పిలుపు
- ఘనంగా సేవాలాల్ 285 జయంత్యుత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన బంజారాలు





సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాల్లో మాట్లాడుతున్న సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, హాజరైన బంజారాలు

గుత్తి రూరల్: బంజారాల హక్కులతో పాటు ధర్మం, గో సంరక్షణ, సమాజాభివృద్ధికి పాటుపడిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, ఆయన బాటలో పయనించాలని సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు కొర్రా జగన్నాథరావు పిలుపునిచ్చారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాలు బుధవారం రాత్రి సేవాగఢ్‌లో ఘనంగా నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు జ్యోతి ప్రజ్వలన చేసి, టెంకాయ కొట్టి ఉత్సవాలు ప్రారంభించారు. బంజారాలు ముందుగా సేవాలాల్ ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం విగ్రహాన్ని ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రావడంతో సేవాగఢ్ కిక్కిరిసిపోయింది. ఉత్సవాలనుద్దేశించి సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు మాట్లాడుతూ బంజారాల హక్కుల కోసం జల్ (నీరు), జమీన్ (భూమి), జంగల్ (అడవి) అనే నినాదంతో సేవాలాల్ పోరాడారన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్, బంజారా సంఘం నాయకులు కేశవనాయక్, శంకర్ పవార్ మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద జాతి బంజారాలదే అని, బంజారాల తెగ అన్ని రాష్ట్రాల్లో వ్యాపించిందని అన్నారు. సేవాలాల్ మహరాజ్ సేవాగఢ్‌లో పుట్టినట్లు చరిత్ర ఆధారాలను బట్టి రంజిత్‌సింగ్ నాయక్ కనుగొన్నారని అన్నారు. సేవాగఢ్ ఆలయ అభివృద్ధిని తాము ముందుండి నడిపిస్తామని చెప్పారు. సేవాగఢ్‌ను విద్యా హబ్‌గా తయారు చేస్తామన్నారు. భవిష్యత్తులో డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, వైద్య కళాశాలలతో పాటుగా బంజారా యూనివర్సిటీ ఏర్పాటు విషయమై ప్రభుత్వంతో సంప్రదిస్తామన్నారు. ఆలయ ఆవరణలో టీటీడీ కల్యాణ మండపం అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఉత్సవాలకు వచ్చిన అతిథులను బంజారాల సంప్రదాయ తలపాగా (పగిడి)లతో ప్రత్యేకంగా సన్మానించారు.

బంజారాలు సన్మార్గంలో పయనించండి

బంజారాలు దైవారాధన, సేవా కార్యక్రమాలతో సన్మార్గం వైపు పయనించి మానవ జన్మ సార్థకం చేసుకోవాలని రమేష్ గురూజీ మహరాజ్ సూచించారు. బంజారాలు విద్యావంతులై ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. ఉత్సవాలలో వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, సభ్యులు శేఖర్‌నాయక్, హరిలాల్ నాయక్, ఠాగూర్ నాయక్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి వైఖోమ్, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ భారతి హాజరయ్యారు. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, గుత్తి సీఐలు వెంకటరామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ నబిరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇరుముడులు సమర్పించిన మాలధారులు

కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు చెందిన పలువురు బంజారాలు సేవాలాల్ మహరాజ్ మాల ధరించారు. వారి స్వస్థలాల నుంచి కాలినడకన సేవాగఢ్‌కు చేరుకున్నారు. పూజల అనంతరం సేవాలాల్‌కు ఇరుముడులు సమర్పించారు.

స్టాళ్ల ఏర్పాటు : సేవాలాల్ ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో సమాచార, ప్రసార శాఖ ప్రదర్శన శాల, గిరిజన హక్కుల ఛాయాచిత్రాలతో స్టాళ్లు ఏర్పాటు చేశారు.

పూర్వజన్మ సుకృతం

గుత్తి రూరల్: సేవాగఢ్‌లోని బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. ఉత్సవాలకు హాజరైన మంత్రి మాతా జగదాంబ, సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. బంజారాలు అన్ని రంగాల్లోనూ విశేషంగా రాణిస్తున్నారన్నారు. నిత్యాన్నదానానికి తనవంతుగా రూ.లక్ష విరాళాన్ని మంత్రి ప్రకటించారు.

పుణ్యక్షేత్రంగా సేవాగఢ్

భారతదేశంలోనే బంజారాలకు ఏకైక ఆలయం అనంతపురం జిల్లా సేవాగఢ్‌లో ఉండటం సంతోషంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఈ ఆలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. సేవాలాల్ జయంతిని అనంతపురం జిల్లా పండుగగా గుర్తించడం శుభ పరిణామమన్నారు.



సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు రాధాకృష్ణ

కూడేరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కొర్రకోడుకు చెందిన చిట్రా రాధాకృష్ణ (45) మంగళవారం తన పొలంలోని వేరుశనగ పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. బుధవారం తెల్లావారినా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ స్టార్టర్ పెట్టె వద్ద విగతజీవిగా పడి ఉన్న రాధాకృష్ణను చూసి ఆటోలో అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు విద్యుత్ షాక్‌తో ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మృతుడు అఫ్రోజ్

రాప్తాడురూరల్: చదువుకోవడం ఇష్టం లేని ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి వైఎస్సార్‌కాలనీలో నివాసముంటున్న బాబ్జాన్ టైలరింగ్‌తో జీవనం సాగిస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు అఫ్రోజ్ (18) పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో చదువుపై ఆసక్తి కనబరచకపోవడంతో తమలా కాకుండా ఉన్నతంగా బతకాలంటే చదువులే ముఖ్యమని తల్లిదండ్రులు నచ్చచెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన అఫ్రోజ్ 15 రోజుల క్రితంలో ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన తల్లి వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది. అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటున్న అఫ్రోజ్... మంగళవారం రాత్రి సిండికేట్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటికి చేరుకుని ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

విచక్షణతో ప్రవర్తించండి

- టీడీపీ కౌన్సిలర్ల తీరుపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం
- మున్సిపల్ చైర్మన్‌ను ప్రశ్నించే దమ్ము లేక అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరిక
- డీజిల్ దొంగ ఎవరో తేల్చి చెప్పాలని హితవు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: 'మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి స్క్రిప్ట్ మేరకు పచ్చ పార్టీ కౌన్సిలర్లు యాక్టింగ్ ఇరగదీస్తున్నారు. అసత్య ప్రచారాలు చేస్తూ, కల్లు తాగిన కోతుల్లా ప్రవర్తిస్తున్నారు. ఇదంతా చూసి ప్రజలే అసహ్యించుకుంటున్నారు. ఇప్పటికైనా విచక్షణతో ప్రవర్తించండి. డీజిల్ దొంగ ఎవరన్నది ప్రజలకు తెలుసు. దీనిపై దమ్ముంటే వాస్తవాలు బహిర్గతం చేయండి. ఇప్పటికైనా విచక్షణతో ప్రవర్తించకపోతే రాజకీయ భవిష్యత్తు లేకుండా పోతుంది' అంటూ టీడీపీ కౌన్సిలర్ల తీరుపై తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దమ్ముంటే జేసీని నిలదీయండి

దాదాపు 35 సంవత్సరాల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నైజం ఏమిటో తాడిపత్రి వాసులకు బాగా తెలుసునన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఆయన సాగిస్తున్న అవాస్తవ ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో దాదాపు రూ.50 లక్షల విలువైన డీజిల్ పక్కదారి పట్టించడంపై దమ్ముంటే జేసీ ప్రభాకరరెడ్డిని నిలదీసి, వాస్తవమేమిటో బహిర్గతం చేయాలని టీడీపీ కౌన్సిలర్లకు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీడియా ముఖంగా చర్చకు తాను సిద్ధమన్నారు. ఆయన అనుయాయులే గతంలో మున్సిపల్ చైర్మన్లుగా ఉన్నప్పుడు 2016 నుంచి 2019 వరకూ మున్సిపాలిటీ వివిధ అభివృద్ధి పనులకు రూ.3,48,40,785 వ్యయంతో డీజిల్ కొనుగోలు చేశారని వివరించారు. అప్పట్లో ఏటా రూ.కోట్లలోనే డీజిల్ కొనుగోలు చేసినట్లుగా రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2019 నుంచి ఇప్పటి వరకూ రూ.3,22,38,466 విలువైన డీజిల్ కొనుగోలు చేశారన్నారు. ఏటా రూ.లక్షల్లో డీజిల్ కొనుగోలు చేసినట్లుగా రికార్డులు పేర్కొంటున్నాయన్నారు. 2016 నుంచి 2019 వరకు ఉన్న డీజిల్ ధరలు, 2019 నుంచి ఇప్పటి వరకూ ఉన్న ధరల్లో చాలా వ్యత్యాసం ఉందని, ఈ విషయాన్ని గుర్తించి అప్పట్లో ఎంత మేర దోపిడీ సాగించారో అర్థం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

బకాయిలు చెల్లించకపోగా బెదిరింపులా?

దాదాపు మూడు దశాబ్దాలుగా మున్సిపాలిటీలోని పలు పనులకు డీజిల్ సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌కు రూ.25 లక్షల బకాయిలు చెల్లించకపోగా చైర్మన్ భయభ్రాంతులకు గురి చేయడంతో కొన్ని నెలలుగా ఆయన డీజిల్ సరఫరాకు విముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. దీంతో అభివృద్ధి పనులకు డీజిల్ అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నట్లుగా మున్సిపల్ కమిషనర్ తెలపడంతో తాను చర్చించి మొబైల్ ట్యాంకర్ ద్వారా డీజిల్ సరఫరా చేసేలా మరో వ్యక్తి ద్వారా చర్యలు తీసుకున్నానన్నారు. ఎస్టీపీ-1, 2 యూజీడీ పనులు పూర్తి చేస్తే ఇప్పటికీ బిల్లులు ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. టైలర్స్ కాలనీలో యూజీడీ పైప్‌లైన్ మరమ్మతుకు ఓ తుంట పైపు వేసి పనులు పూర్తి చేశామంటూ జబ్బలు చరుచుకునే పరిస్థితి టీడీపీ కౌన్సిలర్లదన్నారు. ఇప్పటికీ అక్కడ మురుగు నీరు వెళ్లక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో, మున్సిపల్ సిబ్బంది బంద్ సమయంలో కార్యకర్తలను సమన్వయం చేసుకుని సొంత ఖర్చుతో ట్రాక్టర్లను ఏర్పాటు చేయించి పారిశుద్ధ్యం సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

చైర్మన్ ఏం చేస్తున్నట్టు?

మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా సమస్య తలెత్తితే పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్‌ను కాకుండా ప్రజలు ఎమ్మెల్యేను సంప్రదిస్తున్నారంటే ఆయన పనితీరు ఎంతలా దిగజారిందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఓటు వేసి గెలిపించిన ప్రజలకు బాధ్యతతో సేవలందించాల్సింది పోయి జవాబుదారీతనం లేకుండా ప్రవర్తిస్తున్న పచ్చ బ్యాచ్ హైడ్రామాపై ఇప్పటికే ప్రజలు ఏవగించుకుంటున్నారన్నారు. ప్రతి పనికీ ఎమ్మెల్యేనే ప్రజలు ఆశ్రయిస్తుంటే ఇక మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎందుకున్నారో సమాధానమివ్వాలన్నారు. దీనికంటే జేసీ ఇంటి వద్ద ఉన్న బస్సులను క్లీన్ చేసుకుని బతికితే బాగుంటుందని హితవు పలికారు. మున్సిపాలిటీలో పనిచేసే 9 మంది సిబ్బంది దాదాపు ఏడు నుంచి 30 సంవత్సరాలకు పైగా ఇక్కడే పనిచేస్తున్నారని గుర్తుచేశారు. వీరంతా ఓ రెండు, మూడు నెలలు ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లడం మరలా ఇక్కడికే రావడం వెనుక ఎవరి చలువ ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. వీరంతా జేసీ దొంగల ముఠాకు మద్దతుదారులుగా మారారని, వీరికి మున్సిపల్ కమిషనర్ కూడా తోడయ్యారని మండిపడ్డారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం అమృత్ స్కీం కింద మంజూరైన రూ.63 కోట్ల ప్రాజెక్ట్‌కు కౌన్సిల్‌లో ఎందుకు ఆమోదం తెలపడం లేదో చైర్మన్‌ను అడిగే దమ్ము కౌన్సిలర్లకు లేకుండా పోయిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం జేసీ కుటుంబంతో మాత్రమే తాను పోరాడుతానన్నారు. వాస్తవాలు తెలుసుకుని సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలను కోరారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మొసలి కన్నీరు చూసి కరిగిపోతే ఇంట్లోని ఆడవారి మెడలోని పుస్తెల నుంచి ఇతర బంగారు ఆభరణాలు కూడా లాక్కొంటారని హెచ్చరించారు. జేసీ ఆలయాలను అడ్డుపెట్టుకుని దోచుకున్న అంశాలకు సంబంధించిన ఆధారాలను త్వరలో బయటపెడతానన్నారు.

టీడీపీ హయాంలో డీజిల్ ఖర్చు

ఏడాది	డీజిల్ కొనుగోలు
2016-17	రూ.1,14,20,754
2017-18	రూ.1,05,13,910
2018-19	రూ.1,29,06,121
మొత్తం	రూ.3,48,40,785

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీజిల్ ఖర్చు

ఏడాది	డీజిల్ కొనుగోలు
2019-20	రూ.80,21,863
2020-21	రూ.80,50,501
2021-22	రూ.92,47,662
2022-23	రూ.69,18,440
మొత్తం	రూ.3,22,38,466

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష హోమాలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం రథంపై ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి గోవింద నామస్మరణతో భక్తులు లాగారు. రాత్రి 9గంటలకు ధూళోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. గురువారం రాతిదూలం లాగుడు పోటీలు, పానకం బండ్ల ఊరేగింపు, శుక్రవారం ఉట్లమాను జాతర ఉంటాయి. ఉత్సవాలను ఆలయ ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి తదితరులు పర్యవేక్షించారు.

దురుసుగా ప్రవర్తించిన వారిపై కేసు

పుట్లూరు: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌పై దురుసుగా ప్రవర్తించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించారనే కారణంతో బుధవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. చింతకుంట క్రాస్ వద్ద యల్లనూరు మండలం పి.యం కొండాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున నాయుడు, మధుసూదన్‌నాయుడు మద్యం తాగుతుండగా హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించవద్దని హెచ్చరించారు. దీంతో వారిద్దరూ హెడ్‌కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి


ఆదినారాయణ (ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లో శతాధిక వృద్ధుడు పసుపులేటి ఆదినారాయణ (101) బుధవారం మృతి చెందారు. రైల్వే విశ్రాంత ఉద్యోగి అయిన ఆదినారాయణ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, 14 మంది మనవళ్లు, మనవరాళ్లు, 9 మంది ముని మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆదినారాయణ మృతి పట్ల బలిజ సంఘం నాయకులు, రైల్వే ఉద్యోగులు సంతాపం తెలిపారు.

స్కూల్ బస్సు కిందపడి చిన్నారికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు: ప్రైవేట్ స్కూల్ బస్సు కింద పడిన ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పెద్దవడుగూరు మండలం భీమునిపల్లికి చెందిన ఎర్రిస్వామి, పద్మావతి దంపతులకు ఓ కుమారుడు, రెండేళ్ల వయసున్న కుమార్తె నిత్యశ్రీ ఉన్నారు. కుమారుడు వేణు రాయలచెరువులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమైన కుమారుడిని తల్లి పిలుచుకెళ్లి స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా చిన్నారి నిత్యశ్రీ వెనుక చక్రం వద్దకు చేరుకుంది. విషయాన్ని గమనించని డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో చక్రం బలంగా తగిలి తీవ్రంగా గాయపడింది. చుట్టుపక్కల వారు గట్టిగా అరవడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బ్రేక్ వేయడంతో ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రురాలిని ఆగమేఘాలపై రాయలచెరువులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వైద్యుడి సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బీజేపీని బలోపేతం చేయండి

ఉరవకొండ: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు సహకరించాలని పార్టీ కార్యకర్తలకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పిలుపునిచ్చారు. ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామానికి చెందిన వాల్మీకి సంఘం నేత సురేంద్ర బుధవారం తన అనుచరులతో కలసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా క్లాక్ టవర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యకుమార్ హాజరయ్యారు. సురేంద్ర మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి


వాల్మీకి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ రంగయ్య (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

కళ్యాణదుర్గం: మహర్షి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం మండలం పింజిరి కొట్టాల గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహా విష్కరణ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పిల్లల్ని ఉన్నతంగా చదివించాలన్నారు. భవిష్యత్తులో గ్రామ రూపురేఖలు సమూలంగా మారుస్తామన్నారు. రోడ్లు, తాగునీరు, శ్మశాన వాటిక వంటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎంపీ స్పష్టం చేశారు. అందరూ కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పింజిరి కొట్టాల నాయకులు ఎర్రిస్వామి, గెజ్జలప్ప, నాయకులు నరసింహారెడ్డి, ఎంపీటీసీ ధనుంజయ, నిజాంవలి, ఈశ్వరయ్య, ఎర్రిస్వామి, నారాయణస్వామి, రామలింగ, శివప్ప, అశోక్‌రెడ్డి, తిరుపాల్, రామాంజి, గోవిందు, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు పాస్టర్ల సదస్సు

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లా పాస్టర్ల సదస్సు గురువారం అనంతపురంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి, అంతర్జాతీయ సువార్త ప్రసంగీకురాలు వైఎస్ విమలారెడ్డి, ప్రభుత్వ క్రిస్టియన్ గౌరవ సలహాదారు రెవరెండ్ బాలాస్వామి, క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

చెన్నైలో జిల్లా విద్యార్థుల బలవన్మరణం

అన్నానగర్(చెన్నై): జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు తమిళనాడులో ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. విరుదునగర్ జిల్లాలోని ఓ కళాశాలలో అనంతపురం జిల్లా నరసాపురం గ్రామానికి చెందిన మంజునాథ్ (20). పూలకుర్లపల్లికి చెందిన అఖిల (19) చదువుతున్నారు. వీరిద్దరూ వేర్వేరు హాస్టళ్లలో ఉంటున్న వీరిద్దరూ బుధవారం తమ గదుల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఇద్దరూ ఒకే జిల్లాకు చెందిన వారు కావడంతో ప్రేమ వ్యవహారమా? లేక మరేదైనా కారణమా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ


ఏఎస్పీ విజయభాస్కరరెడ్డి చేతుల మీదుగా జిల్లా స్థాయి అవార్డు అందుకుంటున్న డ్రైవర్ జి.కె.మొహిద్దీన్, వి.ఎస్.ఎస్. వలి,బి.ఆర్.ఆంజనేయులు

- రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమంలో వక్తలు
- 24 మంది డ్రైవర్లకు ఉత్తమ అవార్డుల అందజేత

అనంతపురం క్రైం: మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారి (ఆర్‌టీఓ) సురేష్‌నాయుడు, అదనపు ఎస్పీ ఆర్.విజయబాస్కరరెడ్డి అన్నారు. అప్రమత్తతతో ఉన్నప్పుడే ఎలాంటి ప్రమాదాన్నైనా అరికట్టవచ్చునన్నారు. అనంతపురంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌టీఓ, ఏఎస్పీతో పాటు జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని, ఆర్టీసీ న్యాయ సలహాదారు చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నపాటి ప్రమాదానికి కూడా కారకులు కాకుండా 30 ఏళ్లకు పైగా డ్రైవింగ్ వృత్తిలో కొనసాగుతూ వచ్చిన పలువురి అంకితభావాన్ని కొనియాడారు. నిత్యం రద్దీగా ఉన్న రోడ్లపై డ్రైవింగ్ చేయడమంటే కత్తిమీద సాములాంటిదన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ డ్రైవర్లు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న పదుల సంఖ్యలో ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదముంటుందన్నారు. కొద్ది రోజుల క్రితం బస్సు నడుపుతూ గుండెపోటుతో మృతి చెందిన ఓ డ్రైవరు ఉదంతాన్ని గుర్తుచేస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు పోతున్నాయని తెలిసి కూడా ప్రయాణికులను గమ్యానికి సురక్షితంగా చేర్చాలన్న ఆ డ్రైవరు లక్ష్యం చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నాగభూపాల్, యూనియన్ నాయకులు సూరిబాబు, పీఎస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 24 మంది డ్రైవర్లకు పురస్కారాలను అందజేశారు. జిల్లా స్థాయి పురస్కారాలను కె.ఎం.మొహిద్దీన్, వి.ఎస్.ఎస్.వలి, బీఆర్ ఆంజనేయులు అందుకోగా, అనంతపురం డిపో పరిధిలో ఎస్‌ఎం బాషా, జేఎస్ రాముడు, బి.లోకయ్య, గుత్తి డిపో పరిధిలో కె. రాజు, బి.ఈరన్న, ఎస్.ఉస్మాన్, గుంతకల్లు డిపో పరిధిలో బి.బాలస్వామి, వై.కె.మూర్తి, హెచ్.కె.పీరా, కళ్యాణదుర్గం డిపో పరిధిలో జి.వెంకటేష్, టి.వి.రమణ, ఎస్.ఆర్.కృష్ణ, రాయదుర్గం డిపో పరిధిలో వి.శేఖర్, డి.జి.నాయక్, పి.రామాంజి, తాడిపత్రి డిపో పరిధిలో బి.శంకర్, ఎం.ప్రసాద్, ఉరవకొండ డిపో పరిధిలో బి.ఎల్.నారాయణ, జె.గంగన్న, ఎం. శివప్రసాద్ ఉన్నారు.

ముగిసిన బాలోత్సవం


ప్రతిభచాటుకున్న విద్యార్థికి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు, నృత్యం చేస్తున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ట్స్ కాలేజ్ ఎగ్జిబిషన్ మైదానం వేదికగా మూడు రోజులుగా సందడిగా సాగిన బాలోత్సవం బుధవారం రాత్రి అంతే ఘనంగా ముగిసింది. చివరి రోజు కావడంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏకపాత్రాభినయం, చిత్రలేఖనం, పద్య పఠనం, జానపద, శాస్త్రీయ, వెస్టర్న్ డ్యాన్సులతో హోరెత్తించారు. రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలైన చిన్నారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. బాలోత్సవం చైర్‌పర్సన్ షమీం షఫీవుల్లా అధ్యక్షత వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోషల్ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీల జయరామప్ప, మానవతా తరిమెల అమరనాథరెడ్డి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత ఖ్యాతిని చాటుతూ ఎస్ఎస్ఎస్ విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న జేఎన్‌టీయూ విద్యార్థిని నందితను ఘనంగా సత్కరించారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాక కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్, సభ్యులు రమణయ్య, లింగమయ్య, కోటేశ్వరప్ప, గోవిందరాజులు, పరమేష్, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

- ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలు


స్టీరింగ్ రాడ్ కట్ కావడంతో పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

ఉరవకొండ: విద్యార్థులతో బయల్దేరిన ప్రైవేట్ స్కూల్ బస్సుకు త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ముగ్గురు పిల్లలు స్వల్పంగా గాయపడ్డారు. వివరాల్లోకెళితే.. ఉరవకొండలోని ఏవీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో వివిధ గ్రామాల విద్యార్థులు చదువుతున్నారు. రోజూ స్కూల్ బస్సు ఆయా గ్రామాల విద్యార్థులను తీసుకొచ్చి.. తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తోంది. బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో విద్యార్థులను స్కూలుకు తీసుకొచ్చేందుకు బస్సు వెళ్లింది. షేక్షానుపల్లి సమీపంలో స్టీరింగ్ రాడ్ కట్ కావడంతో బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బండరాళ్లకు ఢీకొట్టి ఆగిపోయింది. ఆ సమయంలో బస్సులో 25 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హఠాత్పరిణామంతో పిల్లలు భయాందోళనకు గురై కేకలు వేశారు. సమీప పొలాల్లో పనిచేస్తున్న కూలీలు, గ్రామస్తులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని.. పిల్లలను బస్సులోంచి కిందకు దింపారు. వీరిలో ముగ్గురు పిల్లలకు దోకుడు గాయాలయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు కండీషన్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవీఆర్ స్కూల్ బస్సు ప్రమాద విషయం తెలుసుకున్న అనంతరం ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు హరూన్‌రషీద్, జీవీఎస్ఎస్ నాయకులు పురుషోత్తం తదితరులు ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

ప్రైవేట్ స్కూలు బస్సు ప్రమాదానికి గురైందన్న సమాచారం తెలుసుకున్న గుంతకల్లు ఎంవీఐ రాజాబాబు ఉరవకొండకు చేరుకుని విచారణ చేపట్టారు. ఏవీఆర్ స్కూలు ఆవరణలో ఉంచిన బస్సును స్వయంగా ఆయనే నడిపి చూశారు. బస్సు కండీషన్‌లోనే ఉందని చెప్పారు. స్టీరింగ్ రాడ్ ఎలా ఉందో డ్రైవర్ గమనించకుండా నిర్లక్ష్యం చేసినందునే ప్రమాదం జరిగిందని తేల్చారు. ఈ మేరకు రూ.3,500 జరిమానా విధించారు. ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే తిప్పాలని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలకు ఎంవీఐ ఆదేశాలు జారీ చేశారు.

ఇద్దరిని బలిగొన్న అతివేగం

- రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న బైకర్
- తీవ్ర గాయాలతో ఇద్దరూ దుర్మరణం


మృతులు సలార్ బాషా, భువనచంద్ర(ఫైల్)

గుత్తి రూరల్: అతివేగం ఇద్దరిని బలిగొంది. కరిడికొండ శివారు 44వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతుల్లో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మరొకరు చిరు వ్యాపారి ఉన్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని కళాకారుల కాలనీకి చెందిన మల్లికార్జున, శశికళ దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. చిన్న కొడుకు కురువ భువనచంద్ర (29) హైదరాబాద్‌లోని హెచ్‌సీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం స్నేహితుడి బుల్లెట్ బైక్ తీసుకుని అనంతపురం బయల్దేరాడు. ఆటోలో పల్లెలు తిరుగుతూ స్టీలుసామాన్లు, మిక్సీలు విక్రయిస్తూ జీవనం సాగించే బుక్కరాయసముద్రం మండల కేంద్రానికి చెందిన సలార్‌బాషా (55) అర్ధరాత్రి వేళ గుత్తి మండలం కరిడికొండ జాతీయ రహదారి సమీపంలో ఆగాడు. ఇటు వైపు నుంచి అటువైపు ఉన్న ధాబా వద్దకు వెళ్లేందుకని నడుచుకుంటూ రోడ్డు డివైడర్‌పైకి చేరుకున్నాడు. అక్కడ చెట్ల మధ్య నుంచి కిందకు కాలు పెట్టగానే అల్లంత దూరాన 130 కిలోమీటర్ల వేగంతో బైక్‌పై వస్తున్న భువనచంద్ర వేగాన్ని అదుపు చేయలేకపోయాడు. బైక్ ఢీకొని సలార్‌బాషా వంద అడుగుల దూరం ఎగిరి కిందపడగా.. భువన చంద్ర 50 అడుగుల మేర గాల్లోకి ఎగిరి పడ్డాడు. స్థానికులు ప్రమాద విషయాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని.. అచేతనావస్థలో ఉన్న ఇద్దరినీ గుత్తి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుల్లో సలార్‌బాషాకు భార్య రషీదా, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భువనచంద్ర అవివాహితుడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మితిమీరుతున్న బైక్ రేసర్ల ఆగడాలు

గుత్తి శివారు 44వ నంబర్ జాతీయ రహదారిపై బైక్ రేసర్లు పేట్రేగిపోతున్నారు. హైదరాబాద్-బెంగళూరు మధ్య శని, ఆదివారాల్లో వందలాదిమంది బైక్ రేసర్లు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 250 సీసీ నుంచి 500 సీసీ సామర్థ్యం కలిగిన బుల్లెట్, హోండా, యమహా బైక్‌లను రేసర్లు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఆరు గంటల్లో వెళ్లాలని బెట్టింగ్ వేసుకుని.. వేగంతో పోటీపడుతూ వారితో పాటు ఇతరులనూ ప్రమాదాల్లోకి నెడుతున్నారు. జాతీయ రహదారిపై పోలీసులు నిఘా ఉంచి బైక్ రేసర్ల ఆగడాలను అరికట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్టలు


శివపంచాయతన విగ్రహ ప్రతిష్టలు

అనంతపురం కల్చరల్: నగరంలోని సోమనాథనగర్ కోదండరామాలయంలో శివపంచాయతన విగ్రహ ప్రతిష్టలు నేత్రపర్వంగా జరిగాయి. సాయిట్రస్టు ఆధ్వర్యంలో మాతృమూర్తి రుక్మిణమ్మ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మహాశివుడు, విష్ణువు, సూర్యభగవానుడు, వినాయకుడుతో సహా వేదమాత గాయత్రీదేవి విగ్రహాలను పండితులు శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ట చేశారు. హోమాలు, పూర్ణాహుతి, నారాయణ సేవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు మణూరు నాగరాజు, విజయ్‌సాయికుమార్, దేవరకొండ కౌసల్య, ఉమారాణితో పాటు బుల్లితెర నటుడు అమర్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేడు గంధం ఉత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని స్వర్ణకారుల వీధిలో వెలసిన మాసుమాబీబీ సయ్యదా సారాన్ బీబీ గంధం ఉరుసు ఉత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మేరకు దర్గా కమిటీ సభ్యులు బుధవారం దర్గాలో జరిగిన సమావేశంలో వివరాలు అందించారు. ఆదోనికి చెందిన హజ్రత్ సయ్యద్ లతీఫ్ అహమ్మద్ ఖాదిరీ స్వామి, బనగానపల్లికి చెందిన సద్గురు డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్‌బాద్‌షా ఖాదిరీ స్వామి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు. మతసామరస్యాన్ని చాటే గంధం ఉత్సవంలో వివిధ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు, ఫకీర్ల జల్సా జరుగుతాయన్నారు.

అంధులకు 'అమ్మ' అండ


ఆర్థిక సాయమందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన రవికుమార్ కుటుంబానికి 'అమ్మ' సంస్థ అండగా నిలిచింది. రవికుమార్ ప్రారంభంలో తక్కువ అంధత్వంతో ఉన్నా క్రమేపీ పూర్తి అంధుడిగా మారిపోయాడు. అతని భార్య శృతి కూడా పాక్షిక అంధత్వంతో బాధపడుతోంది. వారికి నాలుగేళ్ల కుమారుడు, 11 నెలల కుమార్తె ఉన్నారు. శృతికి అనారోగ్యం చేయడంతో వైద్యులకు చూపించగా గొంతులో గడ్డ ఉన్నట్లు తేలింది. శస్త్ర చికిత్స చేయడానికి రూ.2 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. బతుకు సాగించడమే గగనమైన పరిస్థితుల్లో వారు 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డిని ఆశ్రయించారు. ఆయన స్పందించి బుధవారం ఆ కుటుంబానికి రూ.2.50 లక్షల నగదు అందించారు. నిత్యావసర వస్తువులు కూడా అందజేశారు.

పంపనూరులో నేడు కల్యాణోత్సవం

ఆత్మకూరు: మాఘ శుద్ధ షష్టి సందర్భంగా గురువారం పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయమే స్వామి వారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం ఉంటుందని, అనంతరం కల్యాణోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు.

సెలవులో రూరల్ ఏఓ

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి సాయి లక్ష్మి బుధవారం నుంచి 20 రోజుల పాటు సెలవులో వెళ్లారు. ఇక్కడ రెగ్యులర్ ఏఓగా పనిచేస్తున్న శశికళ గత నవంబరులో మెటర్నిటీ సెలవులో వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఉన్న సాయి లక్ష్మి కూడా వ్యక్తిగత కారణంతో సెలవులో వెళ్లినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఇక్కడికి ఇన్‌చార్జ్ ఏఓను ఇంకా నియమించలేదు.

జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు


వాహన తనిఖీ చేస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసుల బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రాంతాలు, నగరంలోని లాడ్జీల్లోనూ సోదాలు చేశారు. విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలతో పాటు డాబాలు, హోటళ్లలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. హోటళ్లలో అక్రమ మద్యం నియంత్రించడానికి, లాడ్జీల్లో అనుమానాస్పద వ్యక్తులు బస చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

పల్లెబాట పట్టిన పోలీసులు

పోలీసు అధికారులు పల్లెబాట పట్టారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పలు అంశాలపై గ్రామసభల్లో దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో అందరూ సోదరభావంతో మెలగాలని, ప్రశాంతతకు అందరూ సహకరించాలని కోరారు. అలాగే పోలీస్ స్టేషన్లను పోలీసు అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

ఊహకందని అభివృద్ధి చేశాం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 42వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఊహకందని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నగరంలోని 42వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే ఇంటి వద్దకు పరిపాలన ఉంటుందని అన్నారు. ప్రజలు సైతం ఎమ్మెల్యే మాటలతో ఏకీభవిస్తూ..సీఎం జగనన్నకే తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబును నమ్మి మోసపోయామని, మేలు చేసిన జగన్‌కే మద్దతుగా నిలుస్తామని పునరుద్ఘాటించారు.

రూ.1,045 కోట్లతో అభివృద్ధి

తమ ప్రభుత్వం వచ్చిన మొదటి రెండేళ్లు కోవిడ్ విపత్కర పరిస్థితులు తలెత్తినా ఎక్కడా సంక్షేమ పథకాలు ఆగలేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తర్వాత రెండున్నరేళ్లలోనే నియోజకవర్గంలో రూ.1,045 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం, సీఎం ప్రత్యేక నిధులు, నగరపాలక సంస్థ సాధారణ, ఆర్థిక సంఘం, నెడ్‌క్యాప్ తదితర నిధులతో నగరంలో రోడ్లు, కాలువలు, బ్రిడ్జీలను నిర్మించామన్నారు. 50 ఏళ్ల క్రితం నాటి టవర్‌క్లాక్ బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గుత్తి కనకదాస విగ్రహం నుంచి తడకలేరు, ఆర్టీసీ బస్టాండ్, రుద్రంపేట, రాజీవ్ కాలనీ..ఇలా నగరం నలువైపులా రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. రోడ్ల విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తొలగించామన్నారు. మురికివాడల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఎల్లో మీడియాతో కలసి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా..ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మరోసారి సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు రహంతుల్లా, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, అబూసలేహ, బాలాంజినేయులు, టీవీ చంద్రమోహన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, సైపుల్లాబేగ్, శ్రీదేవి, నాయకులు పెన్నోబులేసు, రామచంద్ర, దాదు, మిద్దె నగేష్, తలారి వెంకటేష్, వనారస బలారం, జావెద్, ఉష, భారతి, దేవి, పార్వతి, శోభాబాయి, స్థానిక నాయకులు గద్దం చంద్ర, నదిమివంక నాగరాజు, రమేష్, హరి, సాయి, నాగముని, సూరి, మనోహర్, మస్తానమ్మ, సల్మా, సద్దాం, శివ, రాము, శివమ్మ, చంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


42వ డివిజన్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి

సహకార చట్టంపై అవగాహన తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న శిక్షణ కేంద్రం లెక్చరర్ ఎల్.రాజారెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: గ్రామస్థాయిలో సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే సహకార చట్టం గురించి అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని వక్తలు తెలిపారు. బుధవారం రామ్‌నగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో రెండు జిల్లాల పరిధిలో ఉన్న మత్స్యకార సొసైటీ అధ్యక్షులు, సభ్యులకు 'ఇంపార్టెంట్ ప్రొవిషన్స్ ఆఫ్ ఏపీసీఎస్ యాక్ట్ 1964 అండ్ బుక్ కీపింగ్' అంశంపై శిక్షణ నిర్వహించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీఓ ఎం.ప్రభాకరరెడ్డి, ఫిషరీస్ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎఫ్‌డీఓలు ఫక్కీరప్ప, ఆసిఫ్, డీసీసీబీ విశ్రాంత సీఈఓ డాక్టర్ వేములేటి నరసింహారెడ్డి, లెక్చరర్లు రాజారెడ్డి, మేధిని, నాగవీణ, మురళీమోహన్ తదితరులు హాజరై సహకార చట్టం, సహకార సూత్రాలు, వ్యవస్థ గురించి తెలియజేశారు. సంఘం నిర్వహణ, బుక్ కీపింగ్, ఇతరత్రా వాటి గురించి అవగాహన కల్పించారు.

ఇక కుళాయి తిప్పితే నీరు!


ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హైవేపై పైపులు దించుతున్న దృశ్యం


అనంతపురం శివారులో పైప్‌లైన్ కోసం గుంతలు తీస్తున్న జేసీబీ

- పీఏబీఆర్ నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్
- ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో శరవేగంగా పనులు
- రూ.117 కోట్లు ఖర్చు చేస్తోన్న ప్రభుత్వం

ఆత్మకూరు: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు వేగంగా పనులు చేపడుతోంది. దాదాపు రూ.117 కోట్లు వెచ్చించించి పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు మండలం మీదుగా అనంతపురం రూరల్ మండలం వరకూ ప్రత్యేకంగా పైప్‌లైన్ వేస్తోంది. ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.

80 శాతం పనులు పూర్తి

ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఫలితం లేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పీఏబీఆర్ నుంచి రెండు మండలాలకు తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. రూ.117 కోట్లతో పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు మీదుగా అనంతపురం రూరల్ మండలం వరకు పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఇప్పటికే ఆత్మకూరు వరకు పైప్‌లైన్ పనులు పూర్తికాగా, ప్రస్తుతం ఆత్మకూరు నుంచి అనంతపురం రూరల్ వరకు పనులు వేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపుల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.


ఆత్మకూరులో 10 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపు నిర్మాణానికి జరుగుతున్న పనులు

'సిద్ధం' సభ విజయవంతం చేద్దాం


సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

- పార్టీ శ్రేణులకు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాయలసీమలోని పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు సీఎం జగన్ ఈనెల 18న రాప్తాడు ఆటోనగర్‌లో నిర్వహించనున్న 'సిద్ధం' సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన 'సిద్ధం' బహిరంగ సభ సభాస్థలిని, టెంట్ల ఏర్పాటు, వాహనాల రాకపోకలు, పార్కింగ్ తోపాటు సీఎం హెలిప్యాడ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ...సీఎం వైఎస్ జగన్ జనరంజక పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. అందువల్లే జనమంతా ఇప్పుడు జగన్‌వెంట నడుస్తున్నారని, దీన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలన్నీ ఏకమై కుట్ర పూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వీరెన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే అన్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో రిలీజ్ చేయడం రాయలసీయ జిల్లాల ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. సిద్ధం సభ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా చేద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండురోజుల్లో ఏర్పాట్లు పూర్తి

బుధవారం రాత్రి 'సిద్ధం' సభ పనులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని, సిద్ధం సభ చరిత్రలో నిలిచిపోయేలా కనీవీని ఎరుగని రీతిలో విజయవంతం చేస్తామన్నారు. సిద్ధం సభ మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి రాత్రింబవళ్లు సభ ప్రాంగణంలోనే ఉంటూ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి, రమణారెడ్డి, అంజి, రామలింగమయ్య, బుడగ నాగరాజు, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు పురస్కారాలు


ఏఎస్పీ విజయభాస్కరరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డ్రైవర్ ఎస్.ఎం.బాషా (చిత్రంలో) ఆర్టీఓ సురేష్ నాయుడు, డీపీటీఓ సుమంత్.ఆర్.ఆదోని


ఏఎస్పీ విజయభాస్కరరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జె.ఎస్.రాముడు, బి.లోకయ్య

అనంతపురం క్రైం: డ్రైవింగ్‌లో మూడు దశాబ్దాలకు పైగా ఎలాంటి ప్రమాదాలకు కారకులు కాని పలువురు ఆర్టీసీ డ్రైవర్లు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. అనంతపురం ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో వీరికి అవార్డులను జిల్లా అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి, ఆర్టీఓ సురేష్‌నాయుడు, జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని తదితరులు అందజేశారు.

పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు


రఘు స్కూల్‌లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం


మినర్వా స్కూల్‌లో పూజలో పాల్గొన్న కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఏజీఎం సుబ్బారెడ్డి వేడుకలను ప్రారంభించారు. కొంతమంది విద్యార్థులకు పాఠశాల ఆవరణలో అక్షరాభ్యాసం చేయించారు. ప్రిన్సిపాల్ తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సాయినగర్ కేశవరెడ్డి పాఠశాలలో సరస్వతి మాత విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, వేదమంత్రాల సాక్షిగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాలలో బుధవారం సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ రంగంలో రాణించాలన్నా సకల కళలకు నిలయమైన సరస్వతీ మాత అనుగ్రహం ఉండాలన్నారు. సంగమేష్ సర్కిల్‌లోని రఘు ఇంటర్నేషనల్ స్కూల్‌లో అక్షరాభ్యాసం, సరస్వతి పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి తొలిసారిగా పదవతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆశీర్వచనం చేశారు. స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురు, లోకేష్, ప్రిన్సిపాల్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

రాప్తాడు: ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, ఏపీ ఎన్‌జీఓ నగర శాఖ కార్యదర్శి శ్రీధర్ బాబు కోరారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ సీతారామ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 30 శాతం ఐఆర్ ప్రకటించడంతో పాటు 11వ పీఆర్‌సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ డీఏలు ఇవ్వడంతోపాటు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ప్రభాకర్ గౌడ్, సీహెచ్‌ఓ శివప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

- వాడవాడలా సామూహిక అక్షరాభ్యాసాలు



అలంకార సేవల్లో పూజలందుకున్న శారదామాత, వేదమాత గాయత్రి

అనంతపురం కల్చరల్: చదువులతల్లి సరస్వతి జన్మదినమైన వసంత పంచమి వేడుకలు బుధవారం నగరంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. వందలాది మంది చిన్నారులు సామూహిక అక్షరాభ్యాసాల్లో పాల్గొని చదువులకు శ్రీకారం చుట్టుకున్నారు. మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వర ఆలయం, శారదానగర్‌లోని శంకర మఠాలలో ఉదయం అక్షరాభ్యాసాలు జరిగాయి. శారదామాతకు అభిషేకాలు, విశేష కుంకుమార్చన చేశారు. మహాశివునికి రుద్రాభిషేకాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన తల్లిదండ్రులు, చిన్నారులకు వేద పండితుల ఆశీర్వాద కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వేదమాత గాయత్రి ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని ప్రశాంతి నగర్‌లో వేదమాత గాయత్రి ఆలయ ఏడవ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం గణపతి, వరుణ వాస్తు హోమాలు, 108 కలశాలతో ఉత్సవమూర్తికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకారమైన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఆయుష్యాది అరుణ హోమాలు, మహాపూర్ణాహుతి జరిగాయి. మహిళా మండలి సభ్యులు లలితా సహస్రనామ పారాయణం పఠించారు. సాయంత్రం నగరోత్సవం, ఊంజల సేవ, ప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంవీఎస్ ప్రసాద్, సత్యమూర్తి, మంజునాథ్, నరసింహులు పాల్గొన్నారు.


సామూహిక అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న చిన్నారులు

రోడ్లపై చెత్త కన్పించకూడదు

అనంతపురం కార్పొరేషన్: రోడ్లపై చెత్త కన్పించకూడదని, చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యాధికారులు, కార్మికులకు కమిషనర్ మేఘ స్వరూప్ స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని ఒకటో సర్కిల్‌లో పారిశుధ్య కార్మికుల విధులకు సంబంధించిన మస్టర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. సమయపాలనకు అనుగుణంగా విధులకు హాజరవుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం రెండో రోడ్డు, మూడో రోడ్డు, ఐదో రోడ్డు, ఆజాద్‌నగర్, లక్ష్మీనగర్, కోవూర్‌నగర్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. రోజూ ఉదయం 5.30 గంటలలోపు కార్మికుల హాజరుశాతం ప్రక్రియ పూర్తి చేసి, వారు విధులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. ఉదయం 6 గంటలవుతున్నా విధులకు హాజరుకాకపోతే ఎలాగన్నారు. ట్రాఫిక్ ఉండే సమయంలో చెత్తను ఏ విధంగా తరలిస్తారన్నారు. విధులకు ఆలస్యంగా వస్తే ఉపేక్షించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కార్మికుల విధులను పరిశీలిస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్

కాలువలు శుభ్రం చేయాలి

కాలువలను శుభ్రం చేసే కార్మికులు గురుతర బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ పేర్కొన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు సైతం కాలువల్లో చెత్తచెదారాన్ని వేయకూడదన్నారు. నగరపాలక సంస్థ కార్మికులకు చెత్తను అందించాలన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

అనంతపురం: కేవీ కన్‌స్ట్రక్షన్స్‌పై ఇచ్చిన ఫిర్యాదు విషయంలో పోలీసులు స్పందించలేదని చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అనంతపురం నాలుగో పట్టణ సీఐ ఆర్.ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కేవీ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకుడు తమను మోసం చేశాడని, పోలీసులను ఆశ్రయించినా తమకు న్యాయం చేయలేదని రంజిత్, రవీంద్రనాథ్ మంగళవారం మీడియాతో పేర్కొన్నారు. వీరి సమస్య పోలీసుల పరిధిలోకి రాదని, సివిల్ వివాదం కావడంతో కోర్టుకు వెళ్లాలని సూచించామని సీఐ తెలిపారు. గత డిసెంబర్ నెలలో 'పోలీసు స్పందన'లో అర్జీ ఇస్తే తాము వెంటనే స్పందించామని పేర్కొన్నారు. బిల్డర్, ల్యాండ్ ఓనర్‌కు మధ్య బ్రీచ్ ఆఫ్ అగ్రిమెంట్ అయినందున కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని వారికి వివరించినట్లు సీఐ స్పష్టం చేశారు.

అమరులకు విద్యార్థుల నివాళి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సాయిబాబా జాతీయ కళాశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో బుధవారం బ్లాక్ డే నిర్వహించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాలో జవాన్లపై దాడి ఘటన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా అమర జవాన్లకు నివాళి అర్పించారు. అనంతరం ప్రతి తరగతి గదికి వెళ్లి భద్రతా దళాల గురించి, బ్లాక్ డే ప్రత్యేకతను తెలియజేశారు. పీడీఎస్‌యూ ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కార్యదర్శి అఖి, ఉప కార్యదర్శి క్రిష్ణిబాబు పాల్గొన్నారు.